సామెత (జాతీయముల )కథలు

## తెర వెనుక భాగవతము

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

పూర్వం ప్రజలు వినోద కార్యక్రమాల ద్వారా విజ్ఞానోపార్జన చేస్తూండేవారు. అట్టి వాటిలో వీధి భాగవతాలు, కూచిపూడి నాట్యాలు, తోలు బొమ్మలాటలు, యక్ష గానాలు వంటివి అనేకములు కలవు. వీటిద్వారా కొందరికి బ్రతుకు తెరువు అయ్యేది. వీరు భారత భాగవత రామాయణాది పురాణ గాథలను సుమధురంగా గానం చేస్తూండేవారు.

మూడు వైపుల దడి నాల్గవ వైపు ముఖ భాగమున తెల్లని తెరగట్టి, వెనుక నుండి తోలు బొమ్మలను నేర్పుగా ఆడిస్తూ పాడుతూండేవారు. వాండ్రు నాల్గు వీధుల మొగను ప్రదర్శనమిచ్చునప్పుడు నాల్గు వీధుల జనులు చూచి ఆనందించు చుండిరి. అందు వచ్చే పాత్రలనేకమైనప్పటికి, కేవలం ముగ్గురు నలుగురు చేతనే ప్రదర్శన జయప్రదంగా జరిగేది. తెరవెనుక నుండే వాండ్రు ఏ విధంగా ఉన్నా, ప్రదర్శన మాత్రం చెవుల కింపుగా కన్నుల పండువుగా ఉండేది. అవి రాను రాను రంగస్థల నాటకాలుగా రూపొందినవి. ఆపై అనగా నేడు తెర్పై భాగవతములు గాను ప్రదర్శింపబడు చలన చిత్రముల పేరున పిలువబడుచున్నవి. తమిళదేశ ప్రాంతమున తోలు బొమ్మలకు బదులు తెర వెనుక దూది గుడ్డలు మున్నగు సామాగ్రితో బొమ్మలుగా జేసి ఆడించుచున్నారు. తెరవెనుక నుండి ఆడెడు భాగవత కథయని దీని భావము. లోపల జరిగే కుతంత్రము వెల్లడి కానపుడు తెరవెనుక భాగవతమను పేరు ప్రసిద్ధికెక్కినది.

*** ********* ***

*వచ్చే సంచికలో "**సింగినాదం జీలకర్ర**" గురించి తెలుసుకుందాం.*

### మీకు తెలుసా?

మీకు చీటికి మాటికి కోపం వస్తుంటుందా? మరి ఎలా? కోపం వచ్చిన ప్రతిసారి ఒక పుస్తకములో ఒక గీత గియ్యండి. ఇలా చేస్తూ, రోజూ నిద్రకుపక్రమించే ముందు ఎన్నిసార్లు కోపం వచ్చిందో లెక్కపెట్టుకోండి. అబ్బా! 50 సార్లు కోపం వచ్చిందా? అని మీమీద మీకు కోపం రావచ్చు. అలా వస్తే, మరొక్క గీత గీసుకోండి. ఇలా ఒక వారం రోజులు చేసి చూడండి. ఫలితం మీకే తెలుస్తుంది. ఫలితాలు మాతో పంచుకోవాలనుకుంటే - పంచుకోవచ్చు! మీరు ఈ విషయములను మాతో పంచుకోలేదని మాకు కోపం రాదు. ఎందుకంటే మీరు శాంతంగా ఉంటే మాకు ఆనందం. లోకాసమస్తా సుఖినోభవన్తు! అని కదా వేదవాక్కు.

***